క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

గంగాధర: గంగాధర తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలో రెవెన్యూ సదస్సులు, భూ భారతి దరఖాస్తుల విచారణ, పురోగతి, పెండింగ్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాదాబైనామా, ప్రభుత్వ భూమి దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలని ఆదేశించి నివేదికలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, నాయబ్ తహసీల్దార్ కళావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరమణ

చిగురుమామిడి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్య ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం చిగురుమామిడి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, అవుటు పేషెంట్, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. అధిక రక్తపోటు, షుగర్ పేషెంట్ల వివరాలను పరిశీలించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత మందులు వాడుకుంటూ అధిక ఖర్చు తగ్గించుకోవాలని కోరారు. ఇన్‌పేషెంట్లకు అందుతున్న వైద్యం, ఫార్మసీ స్టోర్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు వారి కుటుంబ సభ్యులకు సాధారణ ప్రసవంపై అవగాహన కల్పించాలన్నారు. సిజేరియన్ వల్ల తలెత్తే సమస్యలు తెలియజేశారు. ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులో స్క్రీనింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. వెంట పీవో ఎంహెచ్ఎస్ డాక్టర్ సనజవేరియా, చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్, చిన్నముల్కనూర్ ఎంఎల్‌హెచ్‌పీ మంజుల వైద్య సిబ్బంది ఉన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో తిరుగు ప్రయాణంలో చిన్నముల్కనూర్‌లోని వెల్‌నెస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మానకొండూర్ పీహెచ్‌సీ సందర్శన

మానకొండూర్: మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజగోపాల్ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలోని వసతులు, పలు రికార్డులను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతీ రోజు ఎంత మంది రోగులు వస్తున్నారు, మందులు సరిపడా ఉన్నాయా అని పీహెచ్‌సీ వైద్యాధికారి సల్మాన్‌ను అడిగారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో రాజునాయక్, సూపర్‌వైజర్ జుబేర్, సరోజ, స్నేహలత, ఎల్‌టీ మునీందర్ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



చొప్పదండి: పట్టణంలోని పదోవార్డులో సోమవారం దోమల మందు పిచికారీ చేశారు. దోమల బెడద పెరిగిందని, నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు శానిటేషన్ అధికారులను కోరారు. దీంతో స్ప్రే కార్యక్రమం చేపట్టామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవాన్ సంబోజి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు సంబోజి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వంశీకృష్ణ

గంగాధర: గంగాధర పరిధిలోని ప్రధాన రహదారులు, చౌరస్తాల వద్ద ఎస్సై బి.వంశీకృష్ణ సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వారికి జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పీయూసీ వంటి పత్రాలు వెంట ఉంచుకోవాలని, అధిక చార్జీలు వసూలు చేయొద్దని సూచించారు. ప్రజల భద్రత, రద్దీ నియంత్ర, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయడం కోసం తనిఖీలు చేపట్టామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆశావహుల క్యూ

- ఎంపీటీసీ స్థానాలకు తీవ్ర పోటీ నెలకొనే అవకాశం
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి దరఖాస్తుల వెల్లువ
- పావులు కదుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ నాయకుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్

చొప్పదండి: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు అధికార పార్టీకి ఆశావహుల నుంచి దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు రావడం, గ్రామాల్లో మొదట జరిగే ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతున్న అభ్యర్థులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులకు దరఖాస్తులను అందజేస్తున్నారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలుండగా మూడు ఎస్సీ, ఐదు బీసీ రిజర్వేషన్, మూడు అన్ రిజర్వుడుగా అధికారులు కేటాయించారు. మొత్తం ఎంపీటీసీ స్థానాల్లో ఐదు మహిళలకు కేటాయించారు. చాకుంట ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ టికెట్ కోసం ఇప్పటికే ఎనిమిది మంది దరఖాస్తు చేశారు. వెదురుగట్ట, భూపాలపట్నం ఎంపీటీసీ స్థానాలకు ఐదుగురు దరఖాస్తు చేశారు. కాట్నపల్లి ఎంపీటీసీ స్థానానికి పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఒక్కరే ఇప్పటి వరకు టికెట్ కోసం దరఖాస్తు చేశారు. రాగంపేట, కొలిమికుంట ఎంపీటీసీ స్థానానికి నలగురు చొప్పున దరఖాస్తు చేశారు. కాగా ఆశావహులు పెరుగుతుండటంతో ఈ నెల 8 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు.

గ్రామాల బాటపట్టిన నాయకులు

ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపు గుర్రాల కోసం బీఆర్ఎస్ నాయకులు వేట ప్రారంభించారు. అధికార పార్టీకి ధీటుగా అభ్యర్థులను ఎంపిక చేయడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల బాట పట్టారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసి నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ నెల 8న రిజర్వేషన్లపై కోర్టు తీర్పు వెలువడనుంది. తీర్పునకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఎదురు చూస్తున్నారు. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే తేదీ దగ్గరపడే కొద్ది నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి





మానకొండూర్: మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి రామడుగు: అవగాహన కల్పిస్తున్న ప్రేమ్‌చంద్రారెడ్డి

మానకొండూర్: స్థానిక సంస్థల ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో వరలక్ష్మి ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులు, బాధ్యతలు, ఎన్నికల సరళిపై ట్రైనర్ శ్రీనివాస్ ప్రిసైండింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఏజెంట్లు, పబ్లిక్‌తో మాట్లాడే విధానం తదితర అంశాల గూర్చి వివరించారు. ఇంపీవో సతీశ్‌కుమార్, ఎంపీడీవో స్టాఫ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం రైతువేదికలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల విధానం, బ్యాలెట్‌పేపర్లు, వేలిముద్ర తదితర అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, ఎంఈవో లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపైన మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో రాజేశ్వరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణాధికారి మందల ప్రేమ్ చంద్రారెడ్డి పలు అంశాలపైన అవగాహన కల్పించారు. ఎంపీవో శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ రాజేష్, ఎంఈవో రంగనాథశర్మ పాల్గొన్నారు.

గంగాధర: మండల పరిషత్ సమావేశహాల్‌లో పీవో, ఏపీవోలకు టీవోటీ అమరేందర్‌రెడ్డి ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాము, ఎంపీవో రమేష్, సూపరింటెండెంట్ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ పీవో, వలంటీర్లు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం సోమవారంతో ఐదో రోజుకు చేరింది. ప్రభుత్వ బడుల్లో చదువు, పిల్లల భవిష్యత్‌కు వెలుగు అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కోసం ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాల సర్వే, అందుకు గల కారణాలు, ప్రభుత్వ కళాశాలలో చేరాలని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, అబాది జమ్మికుంట ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

చేతిరాతపై పోటీలు



బహుమతి అందిస్తున్న ఎంఈవో హేమలత, ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్, తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు చేతిరాతపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ఎంఈవో హేమలత, ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మానకొండూర్: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామశివారులో ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు... వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను బైక్‌పై వెళ్తున్న రామగిరి రాకేశ్ (28), నరేశ్(25) ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి ట్రాక్టర్ కిందపడ్డారు. రాకేశ్ కుడికాలు నుజ్జునుజ్జు కాగా నరేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ బిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాపర్తి గోపాల్, రాపర్తి చింటు ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టణంలోని ప్లైవోవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి సుమన్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సోమవారం టౌన్ సీఐ రామకృష్ణ బాధితుడికి మొబైల్ అందజేశారు. విలువైన వస్తువులు జాగ్రత్తగా వాడుకోవాలని, మొబైల్స్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

తిమ్మాపూర్: పోగొట్టుకున్న ఫోన్‌ను ఎల్ఎండీ పోలీసులు బాధితుడికి అందజేశారు. తిమ్మాపూర్ మండలంలోని జూగుండ్ల గ్రామానికి చెందిన జాల నర్సయ్య ఏడాది క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా దొరికిన ఫోన్ సోమవారం బాధితుడికి అప్పగించారు. ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచించారు.

వేగంగా గాలిగోపురం పనులు



శంకరపట్నం: మండలంలోని కొత్త గట్టు మత్స్యగిరీంద్రస్వామి గాలిగోపురం నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల వరకు పనులు పూర్తి చేయనున్నామని ఆలయ చైర్మన్ కోరం రాజిరెడ్డి తెలిపారు.

ధర్నా విజయవంతం చేయాలి

కరీంనగర్: రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి తెలిపారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు. ఏడాదిన్నర రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదన్నారు. ఈవిషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెడుతున్నందున ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ధర్నాకు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని అన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు



రామడుగు: మండలంలోని గుండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం గంగాధర సబ్ డివిజన్ విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నామని సీజీఆర్ఎఫ్–1 చైర్‌పర్సన్ ఎన్వీ వేణుగోపాలాచారి తెలిపారు. గంగాధర సబ్‌డివిజన్ పరిధిలోని గంగాధర, ఆచంపల్లి, గుండి, చొప్పదండి, అర్నకొండ, సెక్షన్స్ పరిధిలోని వినియోగదారుల కోసం లోకల్ కోర్టు ఏర్పాటు చేశామని విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, వోల్టెజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వినియోగం కన్న ఎక్కువ మొత్తంలో బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు మొదలగు వాటికి సంబంధించిన ఫిర్యాదులను రాతపూర్వకంగా అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదులు ఉదయం 10–30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీసుకోవడం జరుగుతుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరెంట్ సరఫరాలో అంతరాయం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మంగళవారం జాతీయరాహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ రఘు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతీ దరఖాస్తు పరిశీలించాలి

చిగురుమామిడి: మండలంలోని రైతులు భూముల క్రమబద్ధీకరణకు చేసుకున్న సాదాబైనామాలను పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ ఎం రమేశ్ సోమవారం తెలిపారు. 13 క్లస్టర్ గ్రామాలకు 11 మంది జీపీవోలు మాత్రమే విధుల్లో చేరారని, వారి ద్వారా గ్రామాల్లో కొంత పనిభారం తగ్గిందన్నారు. గతంలో తామే ప్రతి దరఖాస్తును పరిశీలించాల్సి ఉండేదని, సాదాబైనామాతో కొనుగోలు చేసిన భూములకు అమ్మిన వారి నుంచి ధృవీకరణ చేస్తే సరిపోతుందన్నారు. ప్రభుత్వం నుంచి ఏలాంటి ఆదేశాలు వస్తే వాటిననుసరించి రైతులకు తగిన సహకారం అందిస్తామని చెప్పారు.

బస్సు పునరుద్ధరించండి



శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని కరీంనగర్ డిపో మేనేజర్‌కు సీపీఐ నాయకుడు యుగేందర్ సోమవారం వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా కరీంనగర్ డిపోకు చెందిన బస్సు కాచాపూర్ మీదుగా గద్దపాకకు వెళ్లేదని, వర్షాలతో రోడ్డు బాగా లేదని నెలరోజులుగా బస్సు సర్వీసు నిలిచిపోయిందని, దీంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

సన్మానం



సన్మానిస్తున్న కవిత, తదితరులు

రామడుగు: గ్రూప్–2లో ఎంపీవో ఉద్యోగం సాధించిన కోరటపల్లి గ్రామానికి చెందిన బందారపు ఆమనిని సోమవారం మాజీ ఎంపీపీ కలిగేటి కవిత సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేకల విజయేందర్, దాసరి రత్నమాల, అనిల్, హరీశ్, పవన్ పాల్గొన్నారు.

వరికి వర్షం ముప్పు



పీచుపల్లిలో నేలవాలిన వరి పంట

గన్నేరువరం: వర్షాలతో రైతులు ఆగమాగమవుతున్నారు. ఇప్పటికే కూరగాయలు, పత్తి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ప్రస్తుతం వరిపంట పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కోత దశలో వర్షాలు, గాలులకు పంట నెలవాలుతోంది. ఎడతెరిపి లేని వర్షాలతో పొలాలన్నీ జాలువారుతున్నాయి. దీంతో నేలవాలిన పంట మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు దిగాలు చెందుతున్నారు. ఇలాగైతే కష్టం నీటిపాలు అవుతుందని రైతులు దిగాలు చెందుతున్నారు.



మానకొండూర్: మండలంలోని వెల్ది–లక్ష్మీపూర్ గ్రామాల మధ్య రహదారిపై ఉన్న కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది వాహనదారులు చెట్ల కొమ్మలను గుర్తుగా పెట్టారు. అధికారులు వెంటనే కల్వర్టు వద్ద మరమ్మతులు చేపట్టి వాహనదారులు ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈ సెల్: 94408 18867

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

అనువైన చోట బ్రిడ్జి నిర్మాణం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: గన్నేరువరం మండలం నుంచి కరీంనగర్ వెళ్లడానికి మానేరు వాగుపై అనువైన చోట బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా మండలంలోని యాస్వాడ, మైలారం గ్రామాల్లో స్థలాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో కలెక్టర్, ఆర్ అండ్‌బీ శాఖ అధికారులతో కలిసి చొక్కారావుపల్లె గ్రామంలో స్థలాన్ని పరిశీలించామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.77 కోట్లు మంజూరు కాగా ఇది సాధ్యమా అని కొందరు ప్రశ్నించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు బ్రిడ్జిపై ఆలోచన చేయలేదని విమర్శించారు. నాలుగు నెలల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేశం, బాలయ్య, బీజేపీ నాయకులు చంద్రారెడ్డి, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల శ్రీధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శ్రీధర్ కుటుంబాన్ని పరామర్శించారు. గోలిరామయ్యపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి లచ్చయ్య మృతి చెందగా ఆయ కుటుంబాన్ని పరామర్శించారు. గ్రూప్ –2లో ఎంపీవో ఉద్యోగం సాధించిన కోరటపల్లి గ్రామానికి చెందిన బందారపు ఆమనిని సన్మానించారు. వెదిర గ్రామ పరిధి వెంకటగిరిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరీశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంజనీప్రసాద్, నాయకులు రమేష్, నర్సింగం, తిరుపతి, మేకల స్వామి, జవ్వాజీ అజయ్ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన రామడుగు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలోమాట్లాడారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రతి ఒక్కరు కష్టపడి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు. రామడుగు సింగిల్ విండో చైర్మన్, పార్టీ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు మురళి, మార్కొండ కిష్టారెడ్డి, మామిడి తిరుపతి, నాగిశేఖర్ మాజీ సర్పంచు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గంగాధర: చొప్పదండి నియోజకవర్గంలో ఆదివారం కురిసిన వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి తక్షణం పరిహారం అందించాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ఇంట్లో సోమవారం వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ప్రణవ్ పార్టీ కుండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. అనంతరం ఇల్లందకుంటలోని ఎల్లమ్మతల్లి ఆలయ అభివృద్ధికి రూ.పది లక్షలు మంజూరు చేయించాలని వినతి పత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారు.

అవయవదానంపై అవగాహన



జ్ఞాపిక అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జమ్మికుంట: పట్టణంలో ఇటీవల మృతి చెందిన కంభంపాటి శ్రీనివాస్ నివాసంలో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.నరహరి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన, మృతుడి సంస్మరణ సభ నిర్వహించారు. బంధువులు, కుటుంబ సభ్యులకు నేత్రదానం, అవయవ దానంపై అవగాహన కల్పించారు. అనంతరం మృతుడి కుమారులు నీరజ్, యశ్వంత్‌కు జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ముస్తాల జగదీశ్వర్, చిటికేశి శివానందయ్య, చిదురాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.